ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 10.04.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. సిద్ధిపేటలో రాజకీయ సమావేశంలో పాల్గొన్నారన్న ఆరోపణలపై ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్ ను రద్దు చేయాలని ఉద్యోగుల జెఏసి ఎన్నికల కమిషన్ ను కోరింది.
2. రాష్ట్రంలోని 17 లోక్ సభ నియోజకవర్గాల ఎన్నికలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికకు ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల కానుంది.
3. రాష్ట్రంలో త్రాగు నీటి అవసరాలకు తగినన్ని నిధులు అందుబాటులో వున్నాయని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.
4. రాష్ట్రంలో ముస్లిం సోదరులు రేపు రంజాన్ పర్వదినం జరుపుకుంటారు. ఈ సందర్భంగా పలు ప్రార్థనా స్థలాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

ఉద్యోగులు:

సిద్ధిపేట రాజకీయ సమావేశంలో పాల్గొన్నారన్న కారణంతో 106 మంది చిరు ఉద్యోగుల సస్పెన్షన్ ను రద్దు చేయాలని ఉద్యోగ సంఘాల JAC మాజీ అధ్యక్షులు దేవీ ప్రసాద్ ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఆయనీ మేరకు ఈ రోజు హైదరాబాద్ లో ఒక ప్రకటన చేశారు. తమ సమస్యల పై చర్చిం చుకోవడానికి ఉద్యోగులు ఏర్పాటు చేసుకున్న సమావేశానికి BRS అభ్యర్థి వెంకట్రాంరెడ్డి వెళ్లి వోటు కోరారని, దీనిపై BJP, కాంగ్రెసు పార్టీలు ఫిర్యాదు చేయటం సరికాదని అభిప్రాయపడ్డారు. ఏ రాజకీయ పార్టీ అయినా తమ ప్రచార కార్యక్రమం లో భాగంగా ఓటర్లను కలవడం సహజమని,అయితే ఉద్యోగులు ప్రచారం చేయలేదనీ, ఎన్నికల కోసం ఉద్యోగులు సమావేశాని నిర్వహించలేదనీ వివరించారు.

MSL

వికాస్ రాజ్

రాష్ట్రంలోని 17 లోక్ సభ నియోజవర్గాల ఎన్నికకు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ నియోజవర్గం ఉప ఎన్నికకు సంబంధించి ఈ నెల 18వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. అభ్యర్థుల ప్రచార సభలకు ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ప్రజలకు అసౌకర్యం కలిగించేలా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజకీయ పార్టీలను హెచ్చరించారు. అర్హులైన వారు ఓటు కోసం ఈ నెల 15వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించార.

ఇలా ఉండగా, ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో సుమారు 71 కోట్ల 73 లక్షల రూపాయల విలవుగల నగదు, బంగారం, మద్యం పట్టుబడిందని అధికారులు చెప్పారు. బంగారం, వెండి నగల విలువ 10 కోట్ల 33 లక్షల రూపాయల వరకు ఉంటుందని ఒక అధికారి తెలిపారు.

PN

శిక్షణ

యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే వారికి కామారెడ్డి మైనారిటీ స్టడీ సర్కిల్ లో పరిమిత సంఖ్యలో శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల వారు ఈ నెల 22 వ తేదీలోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.దయానంద్ తెలిపారు. 28న స్క్రీనింగ్ పరీక్షల తర్వాత వంద మందిని ఎంపిక చేస్తామని చెప్పారు.

పీటీసీ....కామారెడ్డి

కవులు

నల్లగొండ జిల్లా సాహిత్యం, కవిత్వంపై జరుగుతున్న పరిశోధనలు ముమ్మరం కావలసి ఉందని ప్రముఖ సాహితీవేత్త , పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్య అన్నారు. నిన్న ఉగాది సందర్భంగా 'నీలగిరి కవుల చరిత్ర' గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు.అనంతరం ఉగాది కవి సమ్మేళనం జరిగింది.

పీటీసీ...నల్లగొండ

రంజాన్ పండుగ- ట్రాఫిక్ ఆంక్షలు

రేపు రంజాన్ పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు మీరాలం ట్యాంక్ ఈద్గా, హాకీ గ్రౌండ్, మాసబ్ ట్యాంక్ పరిసరాలలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. ఆయా సమయాల్లో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని సూచించారు. శివరాంపల్లి నుంచి ఈద్గా వైపు వచ్చే సాధారణ వాహనదారులను శాస్త్రి పురం, ఎన్ఎస్ కుంట వైపు మళ్లిస్తున్నారు. కాలాపత్తార్ వైపు నుంచి ఈద్గాకు వెళ్లే వాహనాలు.. కాలాపత్తార్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లాలి.

MSL

రంజాన్

ముస్లిం సోదరులు జమ్ము కశ్మీర్ మినహా దేశ వ్యాప్తంగా ఈదుల్ ఫితర్-రంజాన్ పండుగను రేపు జరుపుకుంటారు. ఆ రెండు రాష్ట్రాలలో మాత్రం ఈ రోజు జరుపుకుంటున్నారు. చంద్రదర్శన వీక్షణ కమిటీ గత రాత్రి సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. నిన్న నెలవంక కనిపించనందున పండుగను రేపు జరుపుకోవాలని మజ్లీస్ - ఏ – ఉలామా - డెక్కన్ రూట్ హిలాల్ కమిటీ నిర్ణయించింది. ఆ మేరకు ఈ రోజు యథాప్రకారం ఉపవాస దీక్ష ఉంటుందని ఇమామ్ లు ప్రకటించారు.

డెస్క్

Flag March:

రానున్న లోక్ సభ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకునే విషయమై ప్రజల్లో విశ్వాసాన్ని కల్పించే ఉద్దేశ్యంతో హైదరాబాద్ చత్రినాక్ డివిజన్ మొఘుల్ పురా ప్రాంతంలో ఫ్లాగ్ మార్చ్ జరిగింది. CRPF జవాన్లు, స్థానిక పోలీసులు ఈ ఫ్లాగ్ మార్చ్ లో పాల్గొన్నారు. ముఖ్యంగా ఈ నెలలో పండుగలు ఉత్సవాలు ఉన్నందున ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పోలీసు అధికారులు కోరారు.

MSL

ఓటరు చైతన్యం:

చేవెళ్ళ లోక సభ స్థానంలోని శేరిలింగంపల్లి బొటానికల్ గార్డెన్స్ వద్ద 2K మారథాన్ పరుగును ఎన్నికల సంఘం ముఖ్య అధికారి వికాస్ రాజ్ ఈ ఉదయం జెండా ఊపి ప్రారంభించారు. చేవెళ్ళ నియోజక వర్గంలో పోలింగు శాతాన్ని పెంచే లక్ష్యంతో చేపట్టిన ఓటరు చైతన్య కార్యక్రమాల్లో భాగంగా ఈ పరుగును నిర్వహించారు. ఈ సందర్భంగా CEO మాట్లాడుటూ, పోలింగు శాతం పెరగాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. విద్యార్థులు, బొటానికల్ గార్డెన్స్ వాకర్స్ సంఘం సభ్యులు, హైదరాబాద్ రన్నర్ రివల్యూషన్ సభ్యులతో సహా దాదాపు వెయ్యి మంది

ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. GHMC కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

MSL

ఓటర్లు

వరంగల్ లోక్ సభ నియోజకవర్గంలో అర్హులైన వారు ఈ నెల 15వ తేదీ వరకు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు. కొత్తగా నమోదైన వారి పేర్లతో ఈ నెల 25వ తేదీన అనుబంధ జాబితా విడుదల చేస్తామన్నారు. గత ఫిబ్రవరి 8వ తేదీన తుది జాబితాను ప్రకటించిన సంగతి తెల్సిందే.

పిటిసి వరంగల్

రాజీవ్ రతన్

హైదరాబాద్ లో నిన్న గుండెపోటుతో మరణించిన సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ రతన్ భౌతికకాయానికి జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ఈ రోజు అంత్యక్రియలు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర సీనియర్ అధికారులు రతన్ అంత్యక్రియలకు హాజరయ్యారు.

డెస్క్

కెసిఆర్

బి.ఆర్.ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఈరోజు జగిత్యాల సందర్శించి, జగిత్యాల ఎమ్.ఎల్.ఏ డాక్టర్ సంజయ్ కుమార్ ను పరామర్శిస్తారు. ఎమ్.ఎల్.ఏ తండ్రి, న్యాయవాది హన్మంతరావు ఇటీవల కన్నుమూసారు.

పిటిసి జగిత్యాల

వెంకయ్యనాయుడు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ శక్తిమంతంగా ఎదుగుతోందని, పదేళ్ల క్రితం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పదో స్థానంలో ఉన్న మనదేశం అయిదవ స్థానానికి ఎగబాకిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. 2027 నాటికి మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదారాబాద్ శివార్లలో నిన్న ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొంటూ, దేశం ప్రపంచాన్నే శాసించే స్థాయికి చేరేలా రాష్ట్రాలు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ను వెంకయ్యనాయుడు సత్కరించారు.

డెస్క్

సీఈసీ

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్ కుమార్ కు కేంద్రం ప్రభుత్వం 'జడ్' కేటగిరి భద్రతను కల్పించింది. 40 నుంచి 45 మంది సీఆర్ పీఎఫ్ సిబ్బంది ఆయన రక్షణలో ఉంటారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన ప్రాణాలకు ముప్పు ఉందన్న భద్రతా సంస్థల నివేదికల మేరకు కేంద్ర హోం శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఢిల్లీ పోలీసుల సాయుధ భద్రతా బృందం రాజీవ్ కుమార్ కు, ఎన్నికల కమిషనర్లకు భద్రత కల్పిస్తున్నాయి.

డెస్క్

BJP జీప్ యాత్ర:

BJP రాష్ట్ర అధ్యక్షులు, పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్ రెడ్డి ఈ రోజు నియోజకవర్గంలోని తార్నాక డివిజన్ లాలాపేట్ లో జీప్ యాత్ర నిర్వహించారు. సత్యనగర్ మహాత్మా జ్యోతిబా ఫూలే విగ్రహం వద్ద నుంచీ మొదలైన ఈ యాత్ర శ్రీపురి కాలనీ, ఇందిరానగర్, ఆయుర్వేద క్లినిక్ నల్ల పోచమ్మ గుడి, హనుమాన్ గుడి కమాన్ మీదుగా పలు ప్రాంతాల గుండా సాగింది.

స్థానిక పార్టీ కార్పొరేటర్లు, పలువురు ముఖ్య నేతలు కూడా యాత్రలో పాల్గొన్నారు. కాగా పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్య సభ సభ్యులు Dr K లక్ష్మణ్ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ రోజు అండమాన్ నికోబార్ లో ప్రచారం చేస్తున్నారు.

MSL

తాగునీరు

తాగునీటి సరఫరాకు అవసరమైన నిధులను అందుబాటులో ఉంచామని, అవసరమైతే, ఆర్థిక సంఘం నిధుల నుంచి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కోటి రూపాయల వరకు వినియోగించుకోవచ్చని వెల్లడించింది. కరీంనగర్ ఖమ్మం నగర పాలక సంస్థలతో పాటు రాష్ట్రంలోని పది పురపాలక సంఘాల్లో నీటి ఎద్దడి ఉన్నట్లు గుర్తించి, ఆయా ప్రాంతాలకు నాగార్జునసాగర్,ఉదయ్ సముద్రం, మిడ్ మానేరు నుంచి నీరు విడుదల చేసినట్లు ప్రభుత్వం వివరించింది. గత అక్టోబర్ నుంచి వానలు లేక గోదావరి , కృష్ణా నదులు పరిధిలోని జలాశయాల్లో నీటి మట్టం తగ్గడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

డెస్క్